## క్లుప్తంగా

### 21 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఉపాలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఎన్ రామాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న స్వామివారికి 108 లీటర్ల గోక్షీరం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, 41 కేజీల చందనంతో స్వామివారికి అలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. 22న హనుమజ్జయంతి సందర్భంగా 50 వేల తమలపాకులతో సహస్రనామార్చనలు జరపనున్నట్లు వివరించారు. 23న ఉదయం ఐదు గంటల నుంచి భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

### పోరంకిలో అగ్ని ప్రమాదం



పెనమలూరు: పోరంకి తూముల సెంటర్‌లో ఉన్న గోసేవ దుకాణంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. గో ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ కూరగాయలు, ఇతర ఉత్పత్తుల అమ్మకాలు చేసే గోసేవా దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దుకాణం నుంచి మంటలు, దట్టమైన పొగ వచ్చింది. ఇది గమనించిన నిర్వాహకులు దుకాణంలో ఉన్న గ్యాస్ బండలను వెంటనే బయటకు తీసుకువచ్చారు. విజయవాడ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. సకాలంలో మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### పలు అభివృద్ధి పనులు ప్రారంభం



కంకిపాడు: మండలంలోని గొడవర్రు గ్రామంలో రూ. 3.75 కోట్లతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అంతర్గత రహదారులను ప్రారంభించి, పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి, అనుమోలు ప్రభాకర్‌రావు, పులి కామేశ్వరరావు, ఎస్ రవీంద్ర, నాగేశ్వరరావు, బొర్రా వెంకట్, మాజీ సర్పంచ్ కోనేరు భానుప్రసాద్, ఎంపీడీఓ పీ అనూష, అధికారులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు



గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో రామాలయం వద్ద గన్నవరం – పుట్టగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు నుంచి పాత రోడ్డుకు అనుసంధానించే ప్రాంతంలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రహదారి పూర్తిగా రాళ్లు తేలిపోయింది. వర్షాలు కురిసినప్పుడు మోకాలి లోతున నీరు నిలుస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా దావాజీగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. రామాలయం నుంచి గన్నవరం వరకు రెండో దశలో చేపట్టాల్సిన విస్తరణ పనులు 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రహదారి విస్తరణను పట్టించుకోవడం లేదు. దీంతో రామాలయం నుంచి పాత రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో తరుచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

### నేడు నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి అభిషేకం, భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు ఈడే కుమార్, స్వాతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, నవగ్రహ పూజ, అష్టలక్ష్మీపూజ, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం, శ్రీచక్ర అర్చన, సలీం స్వామి బృందం భజన కార్యక్రమం జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని, పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

# ‘చెత్తసంపద’ నిరుపయోగం

- కేంద్రానికి చేరని వ్యర్థాలు
- వంతెన మార్గం కూలడం కూడా ఓ కారణం
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ప్రాంగణం



మంతెన గ్రామంలో వినియోగంలో లేని చెత్త సంపద కేంద్రం

కంకిపాడు: చెత్త సంపద కేంద్రం లక్ష్యానికి ఆమడ దూరంలో ఉంది. చెత్త, వ్యర్థాల తరలింపు జరగకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సంపద కేంద్రంలో పిట్‌ల గోడలు పగుళ్లు వారుతున్నాయి. ప్లాట్‌ఫాం ధ్వంసమవుతోంది.

మండలంలోని మంతెన గ్రామంలో బుడమేరు అవతలి కట్ట సమీపంలో 2017లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించారు. రూ.5 లక్షలు పైగా సొమ్ము వెచ్చించి వ్యర్థాల నిల్వ, వర్మీకంపోస్టు తయారీకి పిట్‌లను నిర్మించారు. వ్యర్థాలు వేరుచేసేందుకు అనువుగా ప్లాట్‌ఫాం ఏర్పాటుచేశారు.

**నిరుపయోగంగా కేంద్రం...**

కొద్ది రోజులు పాటు ఇక్కడికి వ్యర్థాలు తరలించారు. కంపోస్టు తయారు చేసేందుకు మట్టిని సేకరించారు. అయితే కొద్ది కాలంగా సంపద కేంద్రం వినియోగంలో లేదు. సంపద కేంద్రం వద్దకు వెళ్లేందుకు ఉన్న వంతెన మార్గం రెండేళ్ల క్రితం వరదలకు కూలిపోయింది. దీంతో అవతలివైపునకు వెళ్లేందుకు ఆస్కారం లేదు. ప్రస్తుతం ద్విచక్రవాహనదారులు మాత్రమే భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి. ఇక గ్రామంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను నేరుగా మురుగు కాలువ కట్ట మార్జిన్‌లో డంప్ చేసి అక్కడే కాల్చి బూడిద చేస్తున్నారు. వెరసి చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా తయారైంది.



పగుళ్లు వారుతున్న గోడలు

**సంపద కేంద్రం ధ్వంసం...**

చెత్త సంపద కేంద్రం క్రమేపీ ధ్వంసమవుతోంది. ఇప్పటికే ఈ కేంద్రంలో ఏర్పాటుచేసిన పిట్‌ల గోడలు పగుళ్లువారాయి. కాపలాదారు నివసించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన గది తలుపు తాళాలు తీసేసి ఉన్నాయి. వ్యర్థాలు వేరు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్లాట్ ఫాం ధ్వంసం అవుతోంది. కేంద్రం పరిసరాలు నిర్మానుష్యంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారైంది. మందుబాబులు మద్యం తాగేందుకు దీన్ని ఆవాసంగా మార్చుకున్నారు. ఇక్కడ కనిపిస్తున్న మద్యం సీసాలే ఇందుకు నిదర్శనం. అడపా దడపా పేకాట, జంటలు వచ్చి గడపటం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సంపద కేంద్రం నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. వంతెన శిథిలం కావడంతో అక్కడికి వెళ్లే మార్గం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే అక్కడ జరిగే అసాంఘిక కార్యకలాపాలు, సంపద కేంద్రం పరిరక్షణ విషయాలను గాలికొదిలేశారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# ముందుకు కదలని మురుగు

పూడుకుపోయిన పొలిమేర వాగు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెం, అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలిమేర వాగు పూర్తిగా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో వాగులో మురుగునీరు ముందుకు కదలక ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలీలా ఉన్నాయి. ఈ దావాజీగూడెం, అల్లాపురం గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్ పొడవునా పొలిమేర వాగు విస్తరించి ఉంది. రమణమ్మ చెరువు నుంచి వర్షం నీరు ఈ వాగు ద్వారా ఏలూరు కాలువ దిగువన ఉన్న డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే గత కొనేళ్లుగా ఈ వాగులో పూడికలు తొలగించకపోవడంతో పాటు ఆక్రమణలకు గురై కుదించుకుపోయింది. అంతేకాకుండా పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి దట్టంగా పెరిగిపోవడంతో వాగు రూపురేఖలను కోల్పోయింది. ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పడేయడంతో వాగు పూర్తిగా పూడుకుపోయింది. దీనివల్ల మురుగునీటి పారుదల సక్రమంగా జరగకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా ఈ వాగు మారిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దోమల బెడదతో సాయంత్రం అయితే ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరు గ్రామాల పాలకులు, అధికారులు స్పందించి పొలిమేర వాగు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పొలిమేర వాగు



వాగులో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

# వాగ్దానాలు నెరవేర్చలేకే కూటమి అడ్డదారులు



జి.ప్రణీత్‌కుమార్

కంకిపాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చలేక కూటమి సర్కారు ప్రజల దృష్టిని మరల్చేందుకు అడ్డదారులు తొక్కుతూ అక్రమ అరెస్టులకు తెగబడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీ ప్రణీత్‌కుమార్ విమర్శించారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు, వాగ్దానాలతో ప్రజలను వంచించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. హామీలు అమలుకు నోచుకోక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతన చూసి తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. రాజకీయ ప్రేరేపితంతోనే రిటైర్డు ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీకి ఆదరణ తగ్గించలేరని అన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారన్నారు. ప్రజాక్షేత్రంలో కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు తప్పదని స్పష్టంచేశారు. గడిచిన పదకొండు నెలల కాలంలో కాలయాపన, అప్పులు, ప్రజలపై భారాలు తప్ప ప్రభుత్వం సాధించిందేముందని ప్రశ్నించారు. అక్రమ అరెస్టుల డ్రామాలను మానుకుని, వాగ్దానాల అమలు, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

### హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



పెనమలూరు: హెచ్‌ఐవీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టామని పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మంజుల తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో గైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోరంకిలో ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ హెచ్‌ఐవీ నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంతో మెలగాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి వచ్చిన వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. గుడివాడకు చెందిన కల్చరల్ సొసైటీ కళాకారులు వీరయ్య బృందం ఎయిడ్స్‌పై వీధినాటకం ప్రదర్శించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, గైడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రావు, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

### 23న ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



కంకిపాడు: పెనమలూరు(కంకిపాడు) వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం ఈనెల 23వ తేదీన స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు(ధనయ్య) తెలిపారు. ఉప్పలూరు గ్రామంలోని తన నివాసంలో పాలకవర్గ డైరెక్టర్లతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 23న సాయంత్రం ఐదు గంటలకు ప్రమాణస్వీకారం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సహా పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతకు పోటీలు దోహదం



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో డ్రాయింగ్, క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు



ముస్తాబాద గ్రంథాలయంలో విద్యార్థులు



వణుకూరులో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: విద్యార్థుల మధ్య పోటీలు వారిలోని సృజనాత్మకతను వెల్లడి చేస్తాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కే కృపానందం పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థుల్లోని శక్తి సామర్థ్యాలు వెలికితీయడం నిరంతరం జరగాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. విజేతలను పాఠకులు, గ్రామ పెద్దలు అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కే జ్యోతికుమారి ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు లూడో, చెస్, క్యారమ్స్ ఆటల పోటీలు నిర్వహించారు. స్టేజ్ ఫియర్ లేకుండా విద్యార్థులతో ఉపన్యాసాలు చేయించారు. పాఠకులు పాల్గొన్నారు.

**డ్యాన్స్ పోటీలు**

పెనమలూరు: వణుకూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, తోక కథలు చెప్పించారు. దాదాపు 32 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు.

# ఉత్సాహంగా అ‘పూర్వ’ కలయిక



2004-05 బ్యాచ్ విద్యార్థులు



విశ్రాంత తెలుగు పండితురాలు డాక్టర్ లలితా కామేశ్వరిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. మండలంలోని పునాదిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమావేశం స్థానిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారు విద్యనభ్యసించిన తరగతి గదులకు వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**33 వసంతాల తర్వాత**

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరు రోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఆదివారం సందడి సందడిగా జరిగింది. 33 వసంతాల తర్వాత 1992–93 బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. బాల్యంలోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పాఠశాలలో చదువుకునేటప్పుడు చేసిన చిలిపి చేష్టలు, ఉపాధ్యాయులకు పెట్టిన మారు పేర్లు, తోటి స్నేహితులపై వేసిన జోకులు గుర్తుచేసుకున్నారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మారుబోయిన కోటేశ్వరరావు, నిడమర్తి లలితా కామేశ్వరి, రమణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు తమిరి రమేష్, తిరుపతిరావు, యుగంధర్, శ్రీను కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# వైభవంగా మహాసంప్రోక్షణ కుంభాభిషేకం



శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అష్టబంధ, మహాసంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తులకు పంచగవ్యాదివాసం, క్షీరాదివాసం నిర్వహించారు. కుంభాభిషేకాన్ని పురస్కరించుకొని పోలరెడ్డి శివారెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులు శ్రీరుక్మిణి, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి పంచలోహ విగ్రహాలను(ఉత్సవమూర్తులను) కుంభకోణం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చి దేవదాయ, ధర్మాదాయ శాఖకు అందజేశారు. కుంభాభిషేక కార్యక్రమాల్లో ఆలయ అర్చకుడు రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో రుత్వికులు ఉత్సవమూర్తులకు పంచగవ్యాదివాసం, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమం, వాస్తు హోమం, ఆదివాస హోమం నిర్వహించారు. అలాగే మహాశాంతి కుంభాభిమంత్రణ, మహాశాంతి హోమం, ప్రధాన మూర్తులకు మహాశాంతి స్నపన తిరుమంజనం, పంచశయనాధివాసం, హోత్ర ప్రశంసం సర్వదేవతార్చన, నీరాజనం నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కుంభారాధన వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో సమయంతో పని లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. అసలే ఎండ వేడి తట్టుకోలేకపోతున్న వృద్ధులు, చిన్నారులు ఈ విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా విద్యుత్ నిలిపివేస్తుండటంతో ఉక్కపోతకు గురి అవుతున్నారు. పగలు సమయంలో రెండు, మూడు గంటలు, అర్ధరాత్రి నుంచి ఉదయం నాలుగు గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని ఫలితంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోతుందో అర్థం కావడం లేదని, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసినా సరైన సమాధానం ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఈ వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

# రామవరప్పాడులో కార్డన్ సెర్చ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ దామోదర్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పీఎస్‌ఆర్ కాలనీ, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలు తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, మద్యం సేవించి ఇబ్బందులకు గురి చేస్తే సమాచారం అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లు, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఎవరైన అనుమానితులు సంచరించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ఇబ్బందులకు గురి చేసిన 112కు సమాచారం ఇవ్వాలని ఏసీపీ కోరారు. కార్యక్రమంలో పటమట సీఐ పవన్‌కిషోర్, మాచవరం సీఐ ప్రకాష్, గుణదల సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు హరికృష్ణ, కృష్ణవర్మ, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యాలు



సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్‌యోగభారతి(అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ సంగీత కళాశాల్లో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. యువ నాట్యాచారిణులు జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ అంశాలను ప్రదర్శించారు. పూర్వంగంతో ప్రారంభించి, నర్తనగణపతిం, జెంజెతనన, అపదరోకు(జావళి) సంచరధర(జయదేవుని అష్టపది), భామాకలాపం, బృందావన నిలయే, కృష్ణశబ్దం, సందెకాడపుట్టి, ముద్దుగారే యశోద, గోవిందాశ్రిత, చేరియశోదకు అంశాలను ప్రదర్శించి మంగళంతో ముగించారు. 40 మంది చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విజయకుమార్ మాట్లాడుతూ చిన్నారులకు నృత్యంలో శిక్షణ నిస్తున్న జంగం సిస్టర్స్ కృషిని అభినందించారు.

# ముగిసిన ఆలయ వార్షిక ఉత్సవాలు



అలంకరణలో స్వామివారు

పెనమలూరు: పోరంకిలో గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఉత్సవాల్లో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం వసంతోత్సవం, శ్రీ చక్రస్నానం, శిఖర సంప్రోక్షణ చేశారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారికి పవళింపుసేవ అంగరంగ వైభవంగా చేశారు.